ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలి

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఏపీఎం చామంతి శ్రీనివాస్

లింగంపేట, మే 10 : ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని సెర్ప్ ఏపీఎం చామంతి శ్రీనివాస్ సూచించారు. లింగంపేట మండలం లింగంపల్లి గ్రామంలో కుట్టు శిక్షణ కేంద్రంలో మహిళలకు కుట్టు మిషన్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి గ్రామ స్వరాజ్యం సంస్థ ఆధ్వర్యంలో నెల రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందించడంతోపాటు రాయితీపై కుట్టు మిషన్లు పంపిణీ చేయడం మహిళలకు వరం అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు మరి కొంత మందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. శిక్షణ ఇవ్వడంతో ఇద్దరికి ఆదాయం సమకూరుతుందని వెల్లడించారు. 30 రోజులపాటు శిక్షణ పొందిన 30 మంది మహిళలకు ధ్రువీకరన పత్రాలతో పాటు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లింగంపల్లి మాజీ సర్పంచ్ బండి రాజయ్య, మాజీ ఉప సర్పంచ్ రవి, గ్రామ స్వరాజ్యం జిల్లా కోఆర్డినేటర్ రంగ వెంకటలక్ష్మి, మండల కో-ఆర్డినేటర్ బాజీ లావణ్య, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దుర్గవ్వ, సీసీ శ్రావణ్, సీఏ శ్రుతితోపాటు మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన పాలిసెట్ కోచింగ్

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

కామారెడ్డి, మే 10 : జిల్లా కేంద్రంలో తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఆర్‌కే డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహించిన పాలిసెట్ ముగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీజీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాను ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రతి ఒక్క విద్యార్థి ఈ పాలిసెట్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో విద్యార్థులకు అండగా అందుబాటులో ఉండి మరిన్ని సేవలు అందిస్తామని తెలిపారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం యుద్ధంలో మృతి చెందిన జవానులను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు గంధం సంజయ్, నియోజకవర్గ ఇన్‌చార్జి సమీర్, రాజు, మోహన్, రాజేందర్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

అదనపు కలెక్టర్ విక్టర్

కోమట్‌పల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకం ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

లింగంపేట, మే 10 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ విక్టర్ అధికారులకు సూచించారు. లింగంపేట మండలంలోని కోమట్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తూకం ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. వాతావరణంలో మార్పుల కారణంగా అకాల వర్షాలు కురుస్తున్నాయని వెల్లడించారు. త్వరితగతిన తూకం వేసి ధాన్యం రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. అనంతరం పోతాయిపల్లి, నల్లమడుగు గ్రామాల్లో నిర్వహిస్తున్న భూ భారతి డెస్క్ వర్క్‌ను తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులపై రికార్డులు పూర్తి స్థాయిలో తనిఖీలు చేయాలని సూచించారు. ఆయన వెంట ఆయా గ్రామాల రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఎస్ఆర్ఎన్‌కే కళాశాల పీజీ ఫలితాల విడుదల

పీజీ ఫలితాలను విడుదలను చేస్తున్న తెలంగాణ యునివర్సిటీ ఎగ్జామినేషన్ కంట్రోలర్ సంపత్‌కుమార్

బాన్సువాడ రూరల్, మే 10 : బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ శ్రీరాంనారాయణ్‌ఖేడియా(ఎస్ఆర్ఎన్‌కే) ప్రభుత్వ డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశాలలో శనివారం కళాశాల మొదటి సెమిస్టర్ పీజీ ఫలితాలను తెలంగాణ యునివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ సంపత్‌కుమార్ కళాశాల అధ్యాపక బృందంతో కలిసి విడుదల చేశారు. ఎంఏ (ఇంగ్లిష్), ఎంఏ(తెలుగు) మొదటి సెమిస్టర్ ఫలితాల్లో ఎంఏ ఇంగ్లిష్‌లో వందశాతం ఉత్తీర్ణత, ఎంఏ తెలుగులో 93శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల స్వామి తెలిపారు. కార్యక్రమంలో షేక్ అక్బర్ బాషా, అంబయ్య, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలని వినతి

భిక్కనూరు, మే 10 : మండలంలోని కాచాపూర్ గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీ సురేశ్ షెట్కార్‌కు భిక్కనూరు మాజీ ఎంపీపీ సుదర్శన్ వినతి పత్రం అందజేశారు. శనివారం ఆయనను కలిసి గ్రామంలోని దళితవాడలో నీటి కొరత ఉందని, రెండు బోర్లు వేయించి, మోటర్లు ఇప్పించి నీటి సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు.

వైభవంగా బోనాల పండుగ

ఐలాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న బోనాల ఊరేగింపు

లింగంపేట, మే 10 : మండలంలోని ఐలాపూర్ గ్రామంలో బోనాల పండుగ వైభవంగా నిర్వహించారు. దుర్గమ్మ ఆలయ ఉత్సవాల్లో భాగంగా శనివారం బోనాల పండుగ నిర్వహించారు. అందంగా అలంకరించిన బోనాలను డప్పు వాయిద్యాల చప్పుళ్లతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. దుర్గమ్మ ఆలయంలో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడి పంటలు బాగుండాలని దుర్గమ్మను వేడుకున్నారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంపు

చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న బ్రహ్మకుమారీలు

కామారెడ్డి, మే 10 : జిల్లా కేంద్రంలోని ఓం శాంతి బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శనివారం ఒకరోజు సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'బాలలు బంగారు భవిష్యత్తు' అనే అంశంపై ఓం శాంతి పార్కులో 7 నుంచి 12 ఏండ్ల పిల్లలకు షీటీం నుంచి సెల్ఫ్ ప్రొటెక్షన్ గురించి వివరించినట్లు తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపులో సుమారు 70 మంది చిన్నారులు పాల్గొన్నారని తెలిపారు. వారికి మెడిటేషన్, సూర్య నమస్కారాలు వంటి పలు అంశాలపై చిన్నారులకు వివరించినట్లు పేర్కొన్నారు. అనంతరం చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు జయదీదీ, గంగ, లలిత, సంతోషి, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు శివాజీ విగ్రహావిష్కరణ

లింగంపేట(తాడ్వాయి), మే 10 : తాడ్వాయి మండలం కన్‌కల్ గ్రామంలో ఆదివారం ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కన్‌కల్ గ్రామస్తులు తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎక్కువ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

దొంగతనాల నియంత్రణకు కృషి చేయాలి

నస్రుల్లాబాద్, మే 10 : దొంగతనాల నియంత్రణకు పోలీసులు కృషి చేయాలని డీఎస్పీ విఠల్‌రెడ్డి అన్నారు. నస్రుల్లాబాద్, బీర్కూర్ పోలీస్ స్టేషన్లను ఆయన శనివారం సందర్శించారు. నేరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొంగతనాలు జరగకుండా రాత్రి వేళలో పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. ఇప్పటి వరకు ఎన్ని కేసులు నమోదయ్యాయి, ఎన్ని కేసులను పరిష్కరించారని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీర్కూర్ ఎస్సై రాజశేఖర్, నస్రుల్లాబాద్ ట్రైనీ ఎస్సై అరుణ్‌కుమార్ ఉన్నారు.

గంజ్ పాఠశాల ముందస్తు బడిబాట

బాడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కామారెడ్డి, మే 10 : జిల్లా కేంద్రంలోని గంజ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నీలం లింగం ఆధ్వర్యంలో శనివారం ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని వడ్డెర కాలనీ, బతుకమ్మ కుంటలో ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించి ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

13న పాలిసెట్

కామారెడ్డి, మే 10 : ఈ నెల 13వ తేదీన పాలిసెట్ నిర్వహించనున్నట్లు కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు జిల్లాలో ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2,900 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం10 గంటలకు కేంద్రంలోకి అనుమతించనున్నట్లు తెలిపారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదని తెలిపారు. అభ్యర్థులు తమ వెంట ఒక ఎస్‌బీ పెన్సిల్, బ్లాక్ ఆర్ బ్లూ పాయింట్ పెన్, హాల్‌టికెట్ తీసుకొని రావాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి వాచ్, మొబైల్ ఫోన్లు, పర్సులు, షూ, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని, హాల్‌టికెట్‌పై ఫొటో స్పష్టంగా లేని అభ్యర్థులు గెజిటెడ్ ఆఫీసర్ ద్వారా ఫొటోని ధ్రువీకరణ చేయించుకొని రావాలని సూచించారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు 16న కౌన్సెలింగ్

బాన్సువాడ రూరల్, మే 10 : బాన్సువాడ మండలంలోని కోనాపూర్, హన్మాజీపేట్ గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ నెల 16న కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేయనున్నట్లు గిరిజన సంక్షేమం రిజినల్ కో-ఆర్డినేటర్ గంగారాం నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ శ్యామలాదేవి శనివారం తెలిపారు. ఇంటర్ ఎంపీసీలో 40 సీట్లు, బైపీసీలో 40 సీట్ల చొప్పున ఉన్నాయని తెలిపారు. గిరిజన గురుకుల కళాశాలలో ప్రవేశాల కోసం ఈ నెల 16న చేగుంట బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు విద్యార్థులు సరైన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని వారు సూచించారు.

గ్రంథాలయానికి కాంపిటేషన్ బుక్స్ అందజేత

గ్రంథాలయానికి బుక్స్ అందజేసిన దాతలను సన్మానిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి

కామారెడ్డి, మే 10 : కామారెడ్డిలోని జిల్లా గ్రంథాలయాన్ని రేణువ పవన్, మూలేవా దినేశ్ శనివారం సందర్శించారు. జిల్లా గ్రంథాలయం, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ గ్రంథాలయాలకు వారి తాత రేణువ కాలు రాంజీ, ధనా రాంజీ జ్ఞాపకార్థం కాంపిటేటీవ్ బుక్స్, స్టడీ చైర్స్, ఎస్‌టైప్ చైర్స్ అందజేశారు. వీరిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. గ్రంథాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.

మురళీ నాయక్‌కు ఘన నివాళి

మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

నస్రుల్లాబాద్, మే 10 : బీర్కూర్ మండలంలోని బరంగేడ్గి గ్రామంలో శనివారం దేశ రక్షణలో భాగంగా ప్రాణాలు కోల్పోయిన తెలుగు బిడ్డ మురళీనాయక్ చిత్రపటానికి బాబా సాహెబ్ యువజన సంఘం ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు గైని సంతోష్, గంగాధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ట్యాబ్ ఎంట్రీ ఉండేలా చూసుకోవాలి

తూకం వేసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా సహకార అధికారి రామ్మోహన్

ఎల్లారెడ్డి రూరల్ (నాగిరెడ్డిపేట్), మే 10 : రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడూ ఎంట్రీ చేయాలని, వందశాతం ట్యాబ్ ఎంట్రీ ఉండేలా చూసుకోవాలని జిల్లా సహకార అధికారి రామ్మోహన్ అన్నారు. మండలంలోని వాడీ, చీనూర్, నాగిరెడ్డిపేట్, మాల్తుమ్మెద, గోలిలింగాల, లింగంపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలు కురుస్తున్నందున వర్షానికి ధాన్యం తడువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తూకం వేసిన బస్తాలను టార్పాలిన్లతో కప్పి ఉంచాలన్నారు. ఎటువంటి ఆలస్యం చేయకుండా వెంటనే తూకం చేసిన ధాన్యాన్ని మిల్లులకు పంపించాలని తెలిపారు. రైతుల ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా చూడాలని సెంటర్ ఇన్‌చార్జిలు, ట్యాబ్ ఆపరేటర్లకు సూచించారు. ఆయనతోపాటు సొసైటీ కార్యదర్శి సందీప్, సెంటర్ ఇన్‌చార్జిలు, సిబ్బంది, రైతులు ఉన్నారు.

రెండు వాహనాలు సీజ్

ముస్తాపూర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

లింగంపేట, మే 10 : పెండింగ్ చలాన్లు చెల్లించకుండా తిరుగుతున్న రెండు వాహనాలు సీజ్ చేసినట్లు ట్రైనీ ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. లింగంపేట మండలం ముస్తాపూర్ గ్రామం వద్ద శనివారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన వాహనాలపై 3,450 రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లు వెంటనే చెల్లించాలని సూచించారు. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా తిరుగుతున్న వాహనదారులకు జరిమానా విధించినట్లు తెలిపారు. ట్రైనీ ఎస్సై వెంట పోలీసు సిబ్బంది రాజు, జువ్వి నాయక్, మదన్‌లాల్, వసంత్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నిజాంసాగర్, మే 10 : నిజాంసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలకు చెందిన 2007-08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఒక్కచోట కలుసుకున్నారు. తమ చిన్ననాటి మిత్రులతో కలిసి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు మృతి

పోతంగల్, మే 10: చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు మృతి చెందిన ఘటన పోతంగల్‌లో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగారాం(65) చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే శుక్రవారం మంజీరా నదిలో చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు మంజీరా నది వద్దకు వెళ్లి వెతకగా.. అక్కడ ఒడ్డుపై అతడి బట్టలు గుర్తించారు. అనంతరం మంజీరాలో మృతదేహం లభించింది. ప్రమాదవశాత్తు నీటిలో పడి వల కాళ్లకు చుట్టుకొని మృతిచెంది ఉంటాడని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సునీల్ తెలిపారు.

లారీ ఢీకొని మరొకరు..

రామారెడ్డి (సదాశివనగర్), మే 10 : సదాశివనగర్ మండలం మోడెగామ్ వద్ద లారీ బైక్‌ను ఢీ కొనడంతో ఒకరు మృతి చెందిన ఘటన చోటు చేసుకున్నది. సదాశివనగర్ ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగుల నర్సాగౌడ్(55) మెండి సడక్ నుంచి చిన్న మల్లారెడ్డి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. మోడెగామ్ శివారులోని రైస్‌మిల్ వద్దకు రాగనే, ఎదురుగా లారీ డ్రైవర్ వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో నర్సాగౌడ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విధుల్లో చేరడానికి వెళ్తున్న జవాన్లు

విధుల్లో చేరడానికి వెళ్తున్న జవాన్ హేమ్లా నాయక్

ఎల్లారెడ్డి రూరల్, మే 10 : కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు సెలవుల్లో ఉన్న జవాన్లు తిరిగి విధుల్లోకి చేరుతున్నారు. శ్రీనగర్‌లో పనిచేస్తున్న ఎల్లారెడ్డి మండలం తిమ్మారెడ్డి తండాకు చెందిన హేమ్లానాయక్ అనే జవాన్ 15 రోజుల క్రితం సెలవుల్లో భాగంగా ఇంటికి తిమ్మారెడ్డి తండాకు చేరుకున్నాడు. ఇంకా 20 రోజులు సెలవులు ఉన్న తరుణంలో ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు, శ్రీనగర్ మిలిటరీ క్యాంపు కార్యాలయం నుంచి ఫోన్ వచ్చిందని, ఆయన సెలవులను రద్దు చేసుకొని విధుల్లో చేరడానికి వెళ్లాడు. హేమ్లానాయక్ విధుల్లోకి వెళ్లిన విషయమై మండల ప్రజలు పలువురు అభినందనలు తెలియజేశారు.

'దేశానికి ఉపయోగపడేలా పిల్లలను తయారుచేయాలి'

ఎల్లారెడ్డి రూరల్, మే 10 : యువకులు, పిల్లలను దేశానికి, ధర్మానికి ఉపయోగపడేలా తయారుచేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా సంఘటన మంత్రి వినోద్ కుమార్ అన్నారు. ఎల్లారెడ్డిలో శనివారం ఆయన మాట్లాడారు. వేసవి సెలవుల్లో పిల్లలు, యువకులను డ్యాన్స్ ఇతరత్రా పాశ్చాత్య నాగరికతకు సంబంధించిన అంశాలపై శిక్షణ తరగతులకు పంపుతున్నారని, వాటికి బదులుగా మీ మండలాల, గ్రామాల పరిధిలోని యువకులు, పిల్లలను సెల్ఫ్ డిఫెన్స్, హిందూ సమాజాన్ని, గుడిని, బడిని, అక్కాచెల్లెళ్లను కాపాడడం కోసం, సమాజంలో ఏం చేయాలో, ఏం జరుగుతుందో తెలుసుకునేలా బజ్‌రంగ్‌దళ్ క్యాంపులో అవగాహన కలిస్తున్నదన్నారు. మీ సమీపంలోని విశ్వహిందూ పరిషత్, బజ్‌రంగ్‌దళ్ క్యాంపులకు పిల్లలను పంపాలని ఆయన పిలుపునిచ్చారు.

కుట్టుమిషన్లు అందజేత

కుట్టుమిషన్ అందజేస్తున్న ఎంపీడీవో ప్రకాశ్

ఎల్లారెడ్డి రూరల్, మే 10 : మహిళలకు జీవనోపాధి కల్పించే నిమిత్తం కుట్టుమిషన్లు అందజేసినట్లు ఎంపీడీవో ప్రకాశ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ఎన్‌జీవో గ్రామ స్వరాజ్య సంస్థ కుట్టుశిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పిస్తున్నదన్నారు. కేంద్రంలో 15 రోజుల పాటు శిక్షణ ఇచ్చి వారికి 60శాతం సబ్సిడీతో కుట్టుమిషన్లను ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు సాయిబాబా, మండల కో ఆర్డినేటర్ కవిత, ట్రెయినర్ ప్రభాకర్ తదితరులున్నారు.

రెండు గ్రామాల్లో చోరీ

నస్రుల్లాబాద్, మే 10 : బీర్కూర్ మండలంలోని తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండా గ్రామాల్లోని రెండు ఇండ్లల్లో గుర్తు తెలియని దుండగులు శనివారం చొరబడి బంగారం, నగదు ఎత్తుకెళ్లినట్లు స్థానికులు, బాధితులు తెలిపారు. తిమ్మాపూర్ తండా గ్రామానికి చెందిన ధన్‌సింగ్ గురువారం తన మనుమడు అనారోగ్యానికి గురికావడంతో ఇంటికి తాళం వేసి బాన్సువాడలోని ఓ దవాఖానకు వెళ్లారు. శుక్రవారం ఉదయం వచ్చేసరికి ఇంటి తలుపులు పగలగొట్టి ఆరున్నర తులాల బంగారం, రూ. లక్షా 13 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన అల్వాల చంద్రయ్య గురువారం సాయత్రం మెదక్ జిల్లా ఏడుపాయల కనకదుర్గ దర్శనానికి వెళ్లారు. శుక్రవారం ఉదయం గ్రామ పంచాయతీ కార్యదర్శి శంకర్ ఇందిరమ్మ ఇండ్ల సర్వే కోసం చంద్రయ్య ఇంటికి వెళ్లాడు. అప్పటికే ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో శంకర్.. చంద్రయ్యకు ఫోన్ చేసి తెలుపగా అదేరోజు సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో బీరువా పగులగొట్టి మూడున్నర తులాల బంగారం, 24 తులాల వెండిని దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించినట్లు వారు తెలిపారు. బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PASSPORT LOST

★I, JANGABOI BHOOMAIAH S/o. JANGABOI PEDDANNA R/o. H.No.1-110, Abbapoor (V), Navipet (M), Nizamabad (Dist) నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. E558985 గలది. బైక్‌పై వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైన దొరికినచో సంప్రదించు సెల్: 7780727213

NTZ-338655

FINANCIAL SERVICES

★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.

NT-336491-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు రూ.50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రామారెడ్డి (గాంధారి) మే 10 : గాంధారి మండల ప్రజలు దొంగలతో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఆంజనేయులు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆరు బయట నిద్రించొద్దని సూచించారు. ఊరికి వెళ్తే విలువైన ఆభరణాలు, వస్తువులు ఇంట్లో ఉంచకూడదని చెప్పారు. తాళం వేస్తే బయటికి కనిపించకుండా ఉండేలా చూసుకోవాలని, ఆరు బయట బట్టలు ఆర వేసి ఉండాలని అన్నారు. ఊరికి వెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని మండల ప్రజలకు ఆయన సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

లింగంపేట(తాడ్వాయి), మే 10 : తాడ్వాయి మండలం సోమారం, కృష్ణాజీవాడి గ్రామాల్లో స్థానిక నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. స్థానిక నాయకులు వెంకట్‌రెడ్డి, రాజీవ్‌కుమార్, శివాజీ, శౌకత్, శ్యాంరావు, సుధాకర్‌రావు, రాజు, నాగభూషణం, మోహన్‌రెడ్డి, విఠల్ రావు, నర్సింహారెడ్డి, బాల్‌రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.